34.

# మృదువుగా మధురంగా మాట్లాడండి

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీ జీహ్వాగ్రే మిత్ర భాంధవాః
జిహ్వాగ్రే బంధన ప్రాప్తి జిహ్వాగ్రే మరణం ధ్రువం

**ఏకత్వము నుండియే దివ్యత్వము**

ప్రేమస్వరూపులారా!

మానవుని యొక్క మాట అత్యంత గంభీరమైనది. చాలా విలువైనది. సర్వ సంపదలను చేకూర్చేది. చేకూర్చిన సంపదను అందించేది. మృదు మదురంగా, హితంగా, పవిత్రంగా మన మాటలు వినియోగించాలి. అట్టి వాక్యమే మానవునికి ఆనందం చేస్తుంది. మానవుని యొక్క వాక్యము అనేకమందిని మిత్రులుగా చేస్తుంది. బంధువులుగా చేకూరుస్తుంది. మానవులకు కొంతమంది మాత్రమే బంధువులుండవచ్చును. పవిత్రమైన వాక్యము ధరించినప్పుడు యావత్ప్రపంచమునే బంధువునిగా మారుస్తుంది. మానవునియొక్క వాక్యముచేత ఎన్ని సంపదలనైనా ఎన్ని సుఖములనైనా ఎన్ని చదువులనైనను, ఎన్ని అధికారములనైనను అందింపచేస్తుంది పవిత్రమైన వాక్కు. అదే వాక్యము దుష్ప్రభావముల చేత, దుష్ట గుణములచేత, వల్లించినప్పుడు బంధన ప్రాప్తిని కల్గిస్తుంది. కేవలం బంధమును మాత్రమే కాదు. ఇట్టి వాక్యము మరణమును కూడా తెప్పిస్తుంది. ప్రపంచములో వాక్యములచేత రాజ్యమును కూడా సంపాయించవచ్చును. కడపటికి కాయమును కూడా వదలవచ్చును. ఈ వాక్యమునందు మంచిచెడ్డలు రెండు యిమిడి ఉన్నవి. మంచి వాక్యము కలవానికి విశ్వమే ఒక గృహము. మానవులందరు ఒక కులము. కనుక మానవులందరు ఒక కులముగా, విశ్వమంతయు ఒక గృహముగా విశ్వసింపచేయటానికి వాక్యమే మూలకారణము. మానవుడుచ్చరించే ప్రతి వాక్యము హితముగను, పవిత్రముగను, మృదుమదురమైనదిగా ఉండాలి. మానవుడు సహజంగా ఒకవిధమైన సన్నిహితత్వము పొందవలెనంటే, దివ్యత్వము పొందవలెనంటే అనేక

sri sathyasai vahini amrutam

విధములైన సాధనలు చెయ్యాలి. ఈ వినయ విధేయతలచేత మానవుని వాక్యముచేత ఎంతైనా అభివృద్ధిగాంచుతాడు. కానీ లోకమంతా ఒక్కటే. కనిపించటం అనేకంగా కనిపించవచ్చును. ఈ అనేకరకములుగా కనిపించే ప్రపంచమందు ఒక్కటి అనేది రూపాంతరముగా ఉంటుంది. ఒకటి, రెండు, మూడు, నాల్గు, ఐదు, ఆరు, ఏడు ఎనిమిది, తొమ్మిది, పది ఈ అంకెల యందు అన్నింటికంటె ముఖ్యమైనది ఒకటి. మిగిలినవన్నీ ఈ ఒకటి యొక్క రూపాంతరములే. రెండు సంఖ్య అనుకుంటే రెండు ఒకట్లుచేరితేనే రెండుగా మారిపోయింది. తొమ్మిదికి ఒకటి చేరిస్తే పది అయిపోయింది. తొమ్మిది నుంచి ఒకటి తీస్తే ఎనిమిది అవుతుంది. కాబట్టి పెంచునది, త్రుంచునది ఆ ఒక్కటే. దీనిని “ఏకం సత్ విప్రా బహుధావదంతి.” ఇదే ఏకత్వము. దీనినే ‘ఓం’ ఇత్యేకాక్షరం బ్రహ్మ అన్నారు. ఈ ‘ఓం’ అనేది శబ్దమునందు ఏకత్వాన్ని వహించినటువంటిది. ఏకత్వము నుండియే దివ్యత్వము ఆరంభమవుతున్నాది. ఈ దివ్యత్వములు ప్రత్యేకమైన స్వరూపాలు కాదు. ఓంకారము నుండి ఆవిర్భవించిన ఆకారములే. అన్ని శబ్దములు ఓంకారము యొక్క రూపాంతరములే కానీ జగత్తునందు ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక అనేకత్వాన్ని విశ్వసిస్తున్నారు, అనేక మార్గములలో ప్రయాణము చేస్తున్నారు. అనేక విధములైన ఆశలను పొందుతున్నారు. ఒకటి అనే పదము బీజమువంటిది. కానీ యిదే ఒకానొక కాలములోపల ఈ బీజమునకు పొట్టు కల్గి ఉంటుంది. కానీ కాలకర్మ కారణ కర్తవ్యములు వలన కొంత మార్పు కలగటం చేత ఈ బీజమునుండి పొట్టు వీడిపోయింది. ఆ పొట్టే ఈ జగత్తు. ఆ బీజమే దైవత్వము. ఈ దైవత్వమునకు, ప్రకృతికి ఏమాత్రము భేదము లేదు. మానవునియందు అనేక అంగములుండినప్పటికిని ఆకారము ఒక్కటే అయినట్టుగా ఒకే ఆకారమైన మానవుడు అన్ని అంగములతో కూడినట్టుగా ఈ అంగములతో కూడిన మానవత్వము సమాజమునకు ఒక అంగముగా ఏర్పడింది. నిన్న చెప్పాను. ఈ సమాజము మానవత్వానికి అంగముగా మారుతుంది. ఈ మానవత్వమనే అంగమే ప్రకృతికి అంగముగా మారిపోయింది. ఈ ప్రకృతి పరమాత్మకు అంగముగా ఉంటున్నాది. ఈవిధముగా మానవుని యొక్క అంగములు, మానవుని యొక్క ఆకారము, సమాజము యొక్క తత్వము మానవత్వము, ప్రకృతియొక్క తత్వము సర్వము కూడా భగవంతుని యందున్న అంగస్వరూపములే.

sri sathyasai vachanamrutam

జగత్తులో ఎందు చూచినా అంగాంగముల యొక్క సంబంధమే. ప్రత్యేకించి వేరైనవి కాదు. "సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖం, సర్వతః శృతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి" అన్ని ఆకారములు ఒక్క ఆకారము నందున్న అంగములే. దీనినే వేదము "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అనగా లోపల, బయట ఎక్కడ చూచినా నారాయణ స్వరూపమే కలదని బోధించింది. ఈ విత్తనమే దైవముగా మారి, విత్తనముపై పొట్టే జగత్తుగా మారిపోయింది. జగత్తు ఈశ్వరుని సంబంధము జగదీశ్వర సంబంధము. దీనినే ఈశావాస్య మిదం జగత్ అన్నది ఉపనిషత్తు. అందరు భగవంతుని యొక్క అంశములే.

**మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః దీనినే గీత యందు**
**మన్మనా భవ మద్భక్తో**
**మద్యాజి మామ్ నమస్కురు**

అని చెప్పారు. నీవే నా భక్తుడవు, నీవు నా సన్నిహిత సంబంధుడవు. నేను, నీవు ఒక్కటే నమస్కారం చేస్తున్నావు. ఎవరికి చేస్తున్నావు? నీకు నీవు చేసుకుంటున్నావు. ఆనందిస్తున్నావు ఎవరి నిమిత్తమై ఆనందిస్తున్నావు. నీ నిమిత్తమై నీవు ఆనందిస్తున్నావు. ఈనాడు ప్రపంచములో ప్రతివ్యక్తి కూడను అనేక వస్తువులు ఆశిస్తుంటాడు, ప్రేమిస్తుంటాడు. అయితే ఈ ప్రేమించే వ్యక్తి వస్తువు నిమిత్తము ప్రేమిస్తున్నాడా? కాదు, కాదు తన నిమిత్తమై ఆ వస్తువును ప్రేమిస్తున్నాడు. ఒక వ్యక్తిని ప్రేమిస్తున్నాడు. ఆ వ్యక్తి నిమిత్తమై ప్రేమిస్తున్నాడా ఈ మానవుడు. కాదుకాదు తన ఆనంద నిమిత్తమై ఆ వ్యక్తిని ప్రేమిస్తున్నాడు. మానవుడు ఈ లోకములో ఏ వస్తువును చూచినా, ఏవ్యక్తిని చూచినా, ఏవిషయమును చింతించినా అన్నీ తన నిమిత్తమై తాను చేసుకునే పనులే. అయితే అనేకత్వముతో కూడిన మానవత్వాన్ని ఏకత్వముగా చూచే వ్యక్తులు చాలా అరుదు. కానీ ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించే వ్యక్తులు అనేక మంది ఉంటున్నారు. అది సరైన మార్గము కాదు. అనేకత్వములో ఉండిన ఏకత్వమును గుర్తించిన వ్యక్తులు నిజమైన సార్థక జీవులు. కానీ అనేకత్వములోని ఏకత్వము గుర్తించే నిమిత్తమై ఒక గురువు కావాలి. వారినే యీనాడు మనం teachers అంటున్నాము లోకములో. అధ్యాపకుడు అంటే ఏ పనీ లేకపోతే

srisathyasaivacharamrutam

అధ్యాపకుని పని చిక్కుతుంది అంటారు. ఇది చాలా పొరపాటు. అధ్యాపక వృత్తి అన్ని వృత్తులకంటే శ్రేష్ఠమైన వృత్తి. కానీ ఈ సత్యాన్ని గుర్తించుకోలేని వ్యక్తులు అధ్యాపక వృత్తి చిన్నది అని చాలా అల్పముగా భావిస్తుంటారు. ఇతనికి అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థాయికి గొనిపోయే శక్తి ఉంది. ఈ స్వరాజ్య నిమిత్తమై తిలక్ అనేక శ్రమలు పడుతూ వచ్చాడు. ఆ సమయంలో అతని మిత్రులు అతనిని దర్శించారు. తిలక్! మీరు యింత శ్రమ పడుతున్నారు. స్వరాజ్యమే లభిస్తే ఏ మినిస్టరు పదవి మీరు ఆశిస్తారు అని ప్రశ్నించారు. తిలక్ చిరునవ్వు నవ్వుతూ 'నా పవిత్రమైన యీ అధ్యాపకవృత్తి వదలి ఏ మినిస్టరుగానో పోను. ఎంతోమంది విద్యార్థులను జగత్తుకు' నాయకులుగా తయారుచేయగలను. కనుక యీ వృత్తి చాలా శ్రేష్ఠమైన వృత్తి అన్నాడు. అయితే శ్రేష్ఠమైన పదవియందున్న అధ్యాపకులు ఏవిధమైన గుణములు కలిగి ఉన్నారు. అతనియందు పవిత్రమైన చర్యలుండాలి. పవిత్రమైన భావాలు కలిగి ఉండాలి. దురభ్యాసములు అతని యందు ఏమాత్రము చేరకూడదు. దుశ్చర్యలు ఏమాత్రము సల్పకూడదు. ఎందుకోసం విద్యార్థులు అధ్యాపకుని అనుసరించటం వారి సహజలక్షణము. ఏ జ్ఞానము తెలియని విద్యార్థులు, అధ్యాపకుని ఆశ్రయించి, అధ్యాపకుని అనుసరించి, తాను సరైన ఉన్నత స్థితికి పోగలుగుతున్నారు. కనుక ఎన్ని వందలమందో విద్యార్థులకు తాను నాయకుడుగా నిలుస్తున్నాడు. కనుక అట్టి అధ్యాపకుడు దురభ్యాసములకు ఏమాత్రము లోనుకాకూడదు. ఎలాంటివి? మద్యపానము, మాంసభక్షణ, ధూమపానము యిత్యాది దురభ్యాసములు ఏమాత్రము అధ్యాపకుని యందుండరాదు. ఈ అభ్యాసములన్నీ విద్యార్థులు చక్కగా గమనిస్తుంటారు. కనుక అధ్యాపకుడు దీనిని వదలమని చెప్పటానికి అధికారము ఉండదు. విద్యార్థులు దీనిని అనుసరిస్తే మంచిది కాదని చెప్పటానికి అధికారము ఉండదు. ఇంతేకాదు అసత్యము ఆడటము, దొంగతనము చేయటము యిత్యాది దుర్గుణములు అధ్యాపకునియందు ఉండకూడదు. అసత్యమాడినాడంటే విద్యార్థి కూడను అసత్యమాడుతూ వస్తాడు. ఇట్టి పవిత్ర హృదయులైనవారే అధ్యాపకులుగా ఉండాలి. ఈవిధమైన గుణములుండాలి. పవిత్రమైన భావములతో కూడిన వాక్కులుండాలి.

**సద్గుణంబులు సద్బుద్ధి సత్యనిరతి**

sri sathyasai vahini

## భక్తి క్రమశిక్ష కర్తవ్యపాలనంబు

చేయువాడే విద్యావంతుడు. అప్పుడే విద్యార్థులు అతనిని అనుసరిస్తూ వస్తారు. అట్టి విద్యావంతులే అధ్యాపకులుగా ఉండాలి. అతను జగత్తుకు చేసే ఉపకారము యిట్టిది అట్టిది కాదు. ఎంత గొప్పది. జగత్తుకు హాని కల్గించువాడు అధ్యాపకుడే కాదు. జగత్తుకు క్షేమం కల్గించువాడే అధ్యాపకుడు. అధ్యాపకునియందు అనేక బాధ్యత లుంటున్నాయి. ఈ బాధ్యతలు సరైన మార్గములో ప్రవేశపెట్టే మనస్సు కూడా ఉండాలి. మీకందరికి తెలుసు 50 సం॥లకు పూర్వము ఈ స్వరాజ్యము రావాలని అనేకమంది పిల్లలు మొదలుకొని పెద్దలవరకు అనేక శ్రమలకు, కష్టములకు, నష్టములకు, దుఃఖములకు పాల్పడి, ఆస్తిపాస్తులను పోగొట్టుకొని అనేక త్యాగములకు పూనుకున్నారు. అయితే Independence అంటే ఏమిటి? Depend అనగా ఆధారపడి ఉండటం. Independent అంటే యితరులపై ఆధారపడకుండా ఉండటం. కానీ అట్టి పేరుకు తగినట్టుగా జగత్తు నడుస్తున్నదా? ఇతరుల యొక్క పరిపాలనమునందు ఏమాత్రము ఉండకూడదు. మనం స్వతంత్రులుగా జీవించాలి అని ఆశించాము. అయితే యీ Independence వచ్చి 50 సం॥లు అయిపోయింది. 50 సం॥లై మనం స్వాతంత్ర్యము సంపాయించుకున్నప్పటికిని దినదినమునకు పరాధీనులైపోతున్నాము. కొన్ని వేలకోట్ల రూపాయలు అప్పు తీసుకున్నారు. ఇప్పుడు అన్ని దేశముల వారికి ఋణపడి ఉన్నారు. ఇట్టి ఋణస్థులైన వారు స్వతంత్రులని ఎలా చెప్పుకోటానికి అధికారం ఉంది. A,B యిద్దరిలో A,B పై ఆధారపడి ఉండనప్పుడే యితను independent. ఈనాడు ప్రతి భారతీయుడు అనేక కష్టములకు గురౌతున్నాడు. ధనము కావాలి నిజమే. కానీ ఈ ధనము సంపాయించుకోటానికి అప్పు చేయటమా! ఇది సరైన మార్గము కాదు. ఖర్చులు చాలావరకు తగ్గించుకోవాలి. ఆరాటములు, ఆర్భాటములు చాలావరకు తగ్గించుకోవాలి. అప్పుడే మనం ధనము మిగిలించుకోవచ్చును. ఈ ధనముచేత ఎంత పరిపాలనైనా సాగించవచ్చు. కానీ ఆడంబరాలు పెంచుకొని అనేక విధములైన ఆహ్లాదములలో మునిగి, విదేశాల నుండి డబ్బు తీసుకువచ్చి స్వదేశములో వ్యర్థము చేస్తున్నారు. ఇది independent ఎట్లా అవుతుంది. కనుక యిది independence కాదు. ఇది సరైనస్థితి కాదు. ఇది పరాధీనమే. కానీ యింకనూ భారతీయులు సరైన

sri sathyasai vahini

తత్వాన్ని తెలుసుకొనలేక యింకను అప్పులు తీసుకోవటం వల్ల తిరిగి వారికి ఋణస్థులమై పోతున్నారు. వారు ఎప్పుడైనా దీనిని అనుభవించవచ్చును. ఎప్పుడైనా దీనిని గుంజుకోవచ్చును. కనుక యిలాంటి పనికి మనము ఏమాత్రము పాటుపడకూడదు. ఈనాటి విద్యార్థులు సర్వస్వతంత్రులుగా నిలచి స్వేచ్ఛ అనగా ఏమిటనే సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. స్వేచ్ఛ అనగా ఏమిటి? స్వ + ఇచ్ఛ స్వేచ్ఛ. స్వ-ఆత్మ, ఇచ్ఛనే స్వేచ్ఛ. అందుకోసమే ఆత్మ ఇచ్ఛను మనం follow చేయాలి. మన conscience ను మనం follow చేయాలి. కానీ స్వేచ్ఛ అంటే ఈవిధంగా అర్థం చేసుకోవటం లేదు యీనాడు. ఈనాటి విద్యార్థులందరు స్వేచ్ఛ అనగా యిష్టానుసారం బజార్లు తిరగటం, యిష్టానుసారం ఖర్చుపెట్టుకోటం, యిష్టము వచ్చినట్లు మాట్లాడటం ఈవిధమైనదంతా స్వేచ్ఛగా భావిస్తున్నారు. కనుక మాటలు కంట్రోలు చేసుకోవాలి. జీవితాన్నే కంట్రోలు చేయాలి. ఆవిధంగా చేసుకుంటే జగత్తును పోషించిన వారవుతారు, అభివృద్ధి గాంచినవారమవుతారు. కనుక start early, drive slowly, reach safely. ఈ వయస్సునందే విద్యార్థులు ఈ పవిత్రమైన స్వేచ్ఛను ఆచరించటానికి ప్రయత్నించాలి. మనం ఎవరిని అనుసరించనక్కర లేదు. నీ ఆత్మతత్వాన్ని నీవు అనుసరించు. అదియే నీస్వేచ్ఛ పరాధీనులు కాకూడదు. దీనికి ఒక చిన్న కథ ఉన్నాది. ధానాపురమునందు రాజుగారు ఉండేవారు. మహారాజు మరణించిన తరువాత కుమారుడు మహారాజుగా అయ్యాడు. యుక్తవయస్సులోనున్న వ్యక్తి అనేక విచారములకు గురైపోయాడు. నేను ఎవరిని నమ్మాలి? ఎవరి సలహాలు తీసుకోవాలి. ఎవరిని నేను పాటించాలి. ఏవిధంగా రాజ్యము ఏలాలి అనేక రకములుగా యోచిస్తూ వచ్చాడు. ఎవరు మంచియో, ఎవరు చెడ్డనో నేను గుర్తించుకోలేను. తాత ముత్తాతలనుండి తండ్రి వరకు గొప్పకీర్తిని పొందినవారు. అట్టి గౌరవాన్ని నేను ఏరీతిగా సంపాదించాలి. అని యోచిస్తూ ఉండేవాడు. కానీ ఒకనాడు భవనములో కూర్చొని ఉండగా రోడ్డుపై అనేకమంది వృద్ధులు, బాలురు, స్త్రీలు, పురుషులు అనేకమంది గుంపులు గుంపులుగా పోతున్నారు. ఇతను విచారించాడు. ఏమిటి ఈ గుంపులుగా ఎక్కడకు వెడుతున్నారు అడిగాడు. అప్పుడు చెప్పారు. స్వామీ! ఎవరో మహనీయులు ఊరి బయట వచ్చారు. అతను అనేక రకములైన ఆత్మబోధలు

srisathyasaivahini

సల్పుతున్నారు. మానవునియందున్న సమస్త సందేహముల నివారణ జరుగుతున్నాది. ఆ సందేహములను నివారణ గావించుకొని సంతృప్తిపడే నిమిత్తమై ప్రజలు అందరు అక్కడకు వెడుతున్నారు అన్నారు. ఓహో! ఆ డౌటింగ్ థామస్ నేను కూడా. కనుక నేనుకూడను వెళ్లి నా సందేహములు నివారణ గావించుకోవాలని వేషం వేసుకున్నాడు. ఆ మహనీయుని సమావేశములో తాను కూడా కూర్చున్నాడు. ఆయన బోధించే బోధలంతా శ్రవణం చేశాడు. ఎంతో ఆనందంగా ఉండినాది. కానీ మీటింగు జరిగిన తరువాత ఎవరిపాటికి వారు వెళ్లిపోయారు యిండ్లకు. ఇతను మాత్రం అక్కడే కూర్చున్నాడు. కానీ ఈ మహనీయుడు వెడదామని లేచాడు కానీ శాలువ కుర్చీ మూలికి తగులుకొని చిరిగిపోయింది. తక్షణమే తాను వెళ్లి సూది దారము తీసుకున్నాడు. కూర్చొని సూదిలో దారము చేర్చటానికి ఎంతో ప్రయత్నం చేస్తున్నాడు. ప్రక్కన మారువేషంలోనున్న రాజు అది పాతది చిరిగిపోయింది, ఇదుగో నేను కొత్తది తీసుకువచ్చాను కప్పుకోండి అన్నాడు. 'నాకు నీ కొత్త శాలువ అక్కరలేదు. నీవు నాకంత సహాయం చేయదల్చుకుంటే ఈ దారము సూదిలో ఎక్కించి నాకివ్వమన్నాడు. ఆ సూదిలో దారము ఎక్కించి యిచ్చాడు. ఆ మహనీయుడు ఆ చిరిగిపోయిన దాన్ని కుట్టుకున్నాడు. అప్పుడు చెప్పాడు. మానవుడు ఎప్పుడు పరాధీనుడై జీవిస్తున్నాడు. పరాధీనము కాకూడదు. అయితే దైవస్వాధీనులు కావాలి. కానీ తోటి మానవుని సహాయము పొందటం విచిత్రమైనది. నేను దీక్షలో ఉంటున్నాను. తోటిమానవుని ఆధారము తీసుకొని వారి సహాయము పొందటం నాకు యిష్టము లేదు. నా స్వతంత్ర జీవితాన్ని సాధించాలి అని అనేటప్పటికి ఈ మహారాజు doubts అన్ని clear అయిపోయాయి. ఎవరిని మనము ఆశ్రయించనక్కరలేదు. మనయొక్క ఆత్మతత్వాన్ని చక్కగా విశ్వసించి, ఆత్మ విశ్వాసముచేత ఎంతటి కార్యమునైనా సాధించవచ్చు. అన్నింటికిని దైవమే మూలకారణము అని అనుకున్నాడు. ఇంటికి వెళ్లాడు. ఎవరిని సంప్రదించటం లేదు. ఎవరి దగ్గర ఏవిధమైన సంభాషణలు సల్పటంలేదు. ఏది తనకు చక్కగా నిజమని తోస్తుందో ఆ నిజాన్ని చక్కగా అనుసరిస్తూ వచ్చేవాడు. ప్రతి పనియందు నిత్యానిత్య విషయ పరిశీలన జరిపేతత్వము అతనిలో అభివృద్ధి అవుతూ వచ్చింది. అనగా పరాధీనమైన జీవితము మంచిది కాదన్నాడు. దీనికి మరొకటి ఆ స్వామి చెప్పాడు. 'అయ్యా!

sri sathyasai vachanamrutam

ప్రజ్ఞానవంతుడుగా ఉంటుండి ఆత్మజ్ఞానమునందు అనుభూతి కలిగి ఉండి కానీ వీటిని ఆచరించలేనివాడు మలినమైన గుడ్డలు ధరించి ప్రయాణముచేసే గాడిదవంటివాడు అన్నాడు. కనుక నీవు పెద్ద జ్ఞానిగా ఉండవచ్చును. కానీ ఆచరణయందు పెట్టకపోతే మలిన వస్త్రములు మోసే గాడిదగా తయారౌతావు. అలాంటివి మనం చేయకూడదు. ఏది తెలిసిందో ఒకటో రెండో ఆచరణలో పెట్టాలి. ఆచరణలో లేని విద్యలు అపవిత్రమైనవి. ప్రతి మానవుడు ఒకటి రెండైనా ఆచరణలో పెట్టాలి. ఆచరణయందు పెట్టటమే కాదు. తోటి మానవులకు యిది ఆచరణయందు పెట్టటానికి తగిన సహాయము చేయాలి. ఈనాడు చదువుతున్నారు. డిగ్రీలు పొందుతున్నారు. కానీ డిగ్రీల విలువ ఏమిటి? దాని విలువ ఏమాత్రము లేదు. నీవు అందుకునే పట్టా విలువ రెండణాలు కూడా ఉండదు. ఇలాంటి విలువలేని పట్టాలందుకొని ప్రయోజనము ఏమిటి? నీవు సమాజములో ప్రవేశించు. చదివిన చదువును పదిమందికి అందించు. సమాజ సేవలు చేస్తూ రా. The best way to love God is to love all & serve all. కానీ మనం పనులు చేయకుండా ఒక ఆఫీసు కోసమని, ఉద్యోగాల కోసమని application వేసుకుంటే ప్రయోజనం ఏమిటి? ఈనాడు ఎంతమందో చదువుకున్నవారు apply చేస్తున్నారు కానీ no reply. ఇలాంటి జీవితం గడపటం దేనికోసం. పోనీ ఉద్యోగం చిక్కేదాకానైనా నీవు సమాజములో ప్రవేశించు. సత్సంగములో చేరు. తద్వారా నీవు పల్లెలలో సేవలు చేస్తూరా. నాయకుడు కంటే సేవకుడే గొప్పవాడు అన్నారు. శంకరుడు కంటె కింకరుడే గొప్పవాడు అన్నారు. ఈ కింకరుడు ఎంత గొప్ప పేరో అర్థం చేసుకోవాలి. మనకు తెలిసిన సత్యాన్ని సరియైన మార్గములో అనుసరించలేకపోతే ఎన్ని తెలిసి ప్రయోజనం ఏమిటి? రావణునకు పది తలలు ఉన్నాయి. పది తలలు పెట్టుకున్నవి కాదు, పుట్టినవి కాదు. ఆరు శాస్త్రములు నాలుగు వేదములు. ఆరు నాలుగు చేరితే పది. ఒక్కొక్క శాస్త్రము ఒక్కొక్క head. ఒక్కొక్క వేదము ఒక్కొక్క head. కాబట్టి పది తలలున్న వాడు రావణుడు. మహా తపస్సంపన్నుడు. గొప్ప విద్యావంతుడు, మంచి యింజనీరు అతనే పుష్పకవిమానము కనిపెట్టినవాడు. స్వర్గమును కూడా మరిపించే లంకాపట్టణము నిర్మించాడు యింజనీర్లతో. అతనికి తెలియనిది లేదు. 64 విద్యలు నేర్చాడు. కానీ రాముడు నేర్చిన విద్యలు రావణుడుకూడా నేర్చాడు. కడపటికి ప్రయోజనం



sri sathyasai vachanamrutam

ఏమిటి?

**అరువది నాలుగు విద్యలు అరుదారుగ నేర్చిన**
**ఆ రావణుడే నిరదీక సుఖము పొందలేదు.**

కట్టకడపటికి ఏమైపోయింది. ఇంద్రియములను నిగ్రహించుకోలేకపోయాడు. వాంఛలు నిగ్రహించుకొనలేక వంశమునంతా నాశనము చేసుకున్నాడు. ఆశలు చంపుకోలేక అన్నదమ్ములనే చంపుకున్నాడు. కోరికలను చంపుకొనలేక కొడుకులనే చంపుకున్నాడు. కట్టకడపటికి చెడ్డపేరు తెచ్చుకున్నాడు. లంకను నాశనము గావించుకున్నాడు. రాక్షస వంశమే నాశనమై పోయింది. ఇన్ని విద్యలు చదివిన వాడు యీ స్థితికా రావటము. అందువలనే రావణుడు ఏమి చెప్పాడు కట్టకడపటికి. అయ్యా నేను అన్ని విద్యలు నేర్చాను. అన్ని శక్తులు నాయందున్నవి. తపస్సు ఆచరించాను కానీ ప్రయోజనం ఏమిటి? ఒక్కటైనా నేను ఆచరణలో పెట్టలేదు. కనుక మీరందరు నావలే చెడిపోకండి అని చెప్పాడు. నేను ఏ సుఖము పొందాను. సర్వసౌఖ్యములకు స్వర్గపట్టణముగా ఉంటున్నాది లంకా పట్టణము. కానీ ఏ సుఖము పొందలేదు. కారణం ఏమిటి? ఈ వాంఛలచేత నేను కట్టుపడ్డాను. నా ప్రియమైన కుమారుని నేను చంపుకున్నాను. మేము ముగ్గురు అన్నదమ్ములం. అందులో ఒకడు తమోగుణము వాడు. నేను రజోగుణమువాడను. నాతమ్ముడు విభీషణుడు సాత్వికమైనవాడు. ప్రతి మానవుని యందు యీ మూడు గుణములు తప్పక ఉంటుంటాయి. ఈ మూడు గుణములు మానవుని మనస్సు నుండి ఆవిర్భవించేవే. సాత్వికమైన విభీషణుడు మాత్రమే రాముని చేరాడు. తామసికమైన కుంభకర్ణుడు తిండి నిద్ర లోపలనే తన జీవితము గమనించుకోకుండాపోయాడు. ఈ రజోగుణ సంబంధమైన రావణుడు సర్వమును నాశనము గావించుకున్నాడు. కాబట్టి రజో తమో గుణములు మానవుని యందు ఏమాత్రము ప్రవేశించకూడదు. అవి చేరకుండా ఉండాలంటే ఏమి చేయాలి? ఈశ్వరచింతన చేస్తూ వచ్చాడు రావణుడు. చింత చేసినంత మాత్రము చింతలు తీరవు. దానిని ఆచరణలో పెట్టాలి. భగవంతుడు నా హృదయవాసి. హృదయములోనున్న దైవాన్ని నేను ఏవిధంగా తప్పించుకోటానికి వీలవుతుంది. హృదయవాసియైన ఈశ్వరుడు నిరంతరము పవిత్రకర్మలే ఆచరిస్తుంటాడు. ఈ దుష్టగుణములు దూరము చేయాలి.

sri sathyasai vahamrutam

అప్పుడే ఆ విద్యలు సహాయము చేస్తాయి అని తాను సత్యాన్ని గుర్తించాలి. ప్రాణం వదిలేముందు రాముడు లక్ష్మణుని పిలుస్తాడు. 'లక్ష్మణా! మహావీరుడైన, శూరుడైన, జ్ఞానియైన ఆ రావణుడు యిప్పుడు ప్రాణం విడవబోతున్నాడు. అంత్యములో ఏమి పలుకునో నీవు పోయి వినమని' చెప్పాడు. అన్న ఆజ్ఞ శిరసావహించి లక్ష్మణుడు రావణుని దగ్గరకు వెళ్లాడు. ఆ రావణుని నోటి దగ్గర చెవులు పెట్టి విన్నాడు. మూడు కోరికలు నేను చేయలేకపోయాను. అన్నీ చేశాను. మంచి కార్యములు మూడు నేను చేయలేకపోయాను. మొట్టమొదటిది నా లంక చుట్టూ ఉప్పు సముద్రము ఉంటున్నది. ఈ సముద్రమును తీయని సముద్రముగా మార్చాలనుకున్నాను. రెండవది నరకములో అనుభవించే వారికి, స్వర్గముగా మార్చి సుఖాన్ని అందించాలనుకున్నాను. కానీ పాపమునుంచి పుణ్యమునకు నిచ్చెన కట్టాలనుకున్నాను. ఈ మంచి కార్యములు నేను చేయలేకపోయాను. అన్నీ చెడ్డ కార్యములే చేశాను అని తెలుసుకొని వచ్చి అన్నగారితో చెప్పాడు లక్ష్మణుడు. అప్పుడు రాముడు చెప్పాడు. 'లక్ష్మణా! మరణమునకు ముందు విచారించి ప్రయోజనం ఏమిటి? ఏది మంచిది చేయాలనుకున్నాడో తక్షణమే చేసి ఉండాలి. అది చేయక ఎన్ని చింతించి ప్రయోజనం ఏమిటి? మానవునికి రెండు రకములైన విచారములు ఉంటున్నాయి. పూర్వ పశ్చాత్తాపము. తరువాత పశ్చాత్తాపము. క్రియ జరిగిన తరువాతపడే పశ్చాత్తాపము ఒకటి. కార్యమునకు ముందుగానే పడే పశ్చాత్తాపము రెండవది. అర్జునుడు పడినది పూర్వ తాపము. యుద్ధములో పోయి నిల్చింది రథము. తన తల తిరిగింది. కన్నులు తిరిగిపోతున్నాయి. కృష్ణా కృష్ణా నాకు ఈ యుద్ధమక్కరలేదు. యిందరి బంధుమిత్రులు, గురుపుత్రుల వధించి భరించుటెట్టులో? 'నా కన్నులు తిరుగు చున్నవి. కాలము గడుపక కదలు మింటికిన్' అన్నాడు. యిందరి బంధుమిత్రులను చంపి నేను ఏమి అనుభవించేది. నాకు అక్కరలేదు. బంధువులను చంపుకున్న తరువాత నేను బ్రతికి ప్రయోజనం ఏమిటి?

**ఆచరణ లేని చదువు వ్యర్థము**

కౌరవులు క్రూరులు. వారు మంచి మాటలతో ఏమాత్రం స్వాధీనం కారు. అలాంటి వారితో పోరాడి ఆ కూడు తినేకంటే పస్తుంటే మంచిదన్నాడు. అదియే చదువు యొక్క సారము. గొప్ప విద్యావంతుడే రావణుడు. ఇంత విద్యావంతుడై కట్టకడపటికి ఎట్టి చావు

sri sathyasai vachanamrutam

చచ్చాడు. దీనిలో ఒక్కటీ ఆచరణలో పెట్టలేదు. అందుకోసమే వాల్మీకి చెప్పాడు రావణుడు దుష్టుడు. రాముడు సజ్జనుడు అన్నాడు. సజ్జనునికి, దుష్టునికి ఉన్న వ్యత్యాసము ఏమిటి? రాముడు సర్వము త్యాగము చేసి యితరులకు ఆదర్శమునందించాడు. రాజ్య పట్టాభిషేకమునకు సంసిద్ధమవుతున్న రాముడు ఆ నిముషమునందే త్యాగము చేసి అరణ్యమునకు పోవాలంటే తాను సిద్ధమయ్యాడు. పట్టాభిషేకమునకు ఎంత ఆనందమును అనుభవించాడో అరణ్యవాసమున కూడా అంత ఆనందమును అనుభవించాడు. అదే "సుఖ దుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయా జయౌ". సుఖదుఃఖములను రెండింటినీ సమంగా తీసుకున్నాడు. అందువల్లనే సజ్జనుడు అన్నారు. ఆచరణలో పెట్టి జీర్ణము గావించుకుని ఆరోగ్యాన్ని పెంచుకున్నాడు రాముడు. రావణుడు అజీర్ణ వ్యాధితో కృశించి కృంగిపోయాడు. తినటం గొప్పతనం కాదు. జీర్ణింపచేసుకోటం గొప్పతనం. కనుక మనం ఏది మంచిదని విశ్వసించామో దాన్ని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి. విద్యార్థులు చేయవలసిన పని యిది. విద్యార్థులు భవిష్యత్తుకు రాజబాట వేసేవారు. అధ్యాపకులు భవిష్యత్తుకు రాజమార్గం నిర్మించేవారు. ఆ భవిష్యత్ జీవితాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. అప్పుడే మన చదువుకు సరైన గౌరవం లభిస్తుంది. దైవతత్త్వము విశ్వసించక, కేవలము చదువు సంధ్యలయందే కాలము వ్యర్థము చేసిన జీవితమే వ్యర్థమైపోతుంది.

**న తపాంసి న తీర్థానాం న శాస్త్రేణ జపానహి**
**సంసార సాగరోద్ధారే సజ్జనం సేవనం వినా.**

ఈ తపస్సువల్ల, ఈ జపంవల్ల ఏమాత్రం ఉన్నతస్థితి పొందలేరు. సజ్జనుల సేవను సల్పాలి. అప్పుడే యిది సార్థకమవుతుంది. కనుక కాలము వ్యర్థము చేయకూడదు.

**అస్థిరం జీవనం లోకే**
**అస్థిరం యౌవ్వనం ధనం**
**అస్థిరం దారా పుత్రాది**
**సత్యం కీర్తి ద్వయం స్థిరమ్.**

అన్నాడు రాముడు. సత్యం, కీర్తి ఈ రెండు నిలుపుకోటానికి ప్రయత్నించాలి. సత్యమే

sri sathyasai vahini

ఈనాడు దైవస్వరూపము. సత్యము కంటె మించిన దైవత్వము మరొకటి లేదు. ఈ సత్యము త్రికాల బాధ్యమైన సత్యము. మూడు కాలములందు ఉండేదే సత్యము. ఒక కాలములో ఉండి మరొక కాలములో ఉండనిది సత్యము కాదు. అవిభాజ్యము. అయితే నిజమునకు, సత్యమునకు ఉన్న వ్యత్యాసము ఏమిటి? చూచినప్పుడు సూటు వేసుకుని ఉండవచ్చు. రేపటి దినము చూచినప్పుడు అతను లుంగీ కట్టుకుని బనీనుతో ఉండవచ్చును. ఈ దినము అది నిజమే. రేపటి దినము చూచినది నిజమే. కానీ యీనాడు చూచిన వేషము రేపటి దినము లేదు. కాబట్టి అది సత్యము కాదు. ఎప్పుడు చూచినా మారనిదే సత్యము. దీనినే భగవద్గీతయందు ఋతం అన్నారు. సత్యము యింత పవిత్రమైనది. చేసినది చేసినట్లుగా, చూచినది చూచినట్లుగా, అన్నది అన్నట్లుగా చెప్పటం సత్యమనుకుంటున్నారు. అది సత్యము కాదు. అది లోక సత్యము, ప్రాకృతమైన సత్యము కానీ యిది సరైన సత్యము కాదు. ప్రవృత్తి సత్యమే. నివృత్తి సత్యము త్రికాలబాధ్యం. భూత భవిష్యత్ వర్తమానములందు ఎట్టి మార్పు చెందనిదే నిజమైన ఋతం. విద్యార్థులారా! పలికిన పలుకులన్నీ పవిత్రమైనవి, శాశ్వతమైనవిగా ఉండేటట్లు మీరు ప్రయత్నం చేయాలి. దివ్యత్వము పొందుతామా లేదా అనే సందేహము మీలో ఉండవచ్చు. కానీ నీ మాటలలో దివ్యత్వాన్ని ప్రకటింప చేయి. ఏవిధంగా చేయాలి. You can't always oblige, but you can speak always obligingly. అదే చాలు. మధురంగా, ప్రీతిపాత్రంగా తక్కువగా మాట్లాడటానికి ప్రయత్నం చేయి. పిల్లలందరికి నేను అప్పుడప్పుడు చెబుతూనే ఉంటాను. Talk less, work more. మంచి పని చేస్తూ రావాలి. మాట్లాడేవాడు పనిచేయలేడు. పని చేసేవాడు మాట్లాడలేడు. రెండూ జరగటానికి వీలుకాదు. పవిత్రమైన భావాలు పెట్టుకుని యితరులతో సంభాషణ జరుపు. తద్వారా మానవుని యొక్క జ్ఞాపకశక్తి అభివృద్ధి అవుతుంది. జ్ఞాపకశక్తి మాత్రమే కాదు ఆత్మ శక్తి కూడా అభివృద్ధిపరచుకున్న వాడౌతావు. మీరు చదివినది మీకు memoryలో లేకుండాపోవటానికి కారణం ఏమిటి? చదివినది మాటలలో భంగమైపోతున్నాది. చదివిన దాన్ని తిరిగి మననం చేసుకుంటూరా. మననము చేసిన దాన్ని నిధి ద్యాసలో పెట్టు. శ్రవణ, మనన, నిధిధ్యాస యీ మూడు చాలా అవసరమైనవి. ఈ మూడు ఎలాంటివి? వంటి యింటిలో వంట చేయటం శ్రవణం. డైనింగ్ హాలులో తెచ్చిపెట్టుకోవటం మననం.

టేబుల్‌పైన పెట్టుకొని వడ్డించుకొని భుజించటం నిధిధ్యాస. వండిన వంట డైనింగ్‌హాలుకు తెచ్చుకోకుండా నీవు ఎట్లా భుజించగలవు? నీవు వంట చేసుకోవాలి. తట్టలో పెట్టుకోవాలి, పొట్టలోకి చేరాలి. అప్పుడు శ్రవణ మనన నిధిధ్యాస మూడు ఏకమైపోతాయి. అప్పుడే నీ దేహమునకు పుష్టి సంతుష్టి లభిస్తుంది. మీరు పుష్టిగా సంతుష్టిగా జీవించాలనుకుంటే చదవవలసిందే. చదివిన దానిని మననం చేయవలసిందే. మననం చేసిన దానిని ప్రాక్టికల్‌లో పెట్టవలసిందే. ఆచరణలో లేక మననం చేసి ప్రయోజనం లేదు. ఈనాడు bookish knowledge ఎక్కువై పోతున్నది. యిదంతా superficial knowledge గా మారిపోతున్నది. ఈ superficial knowledge ప్రయోజనం లేదు. Practical knowledge మీరు సంపాయించాలి. అన్నింటిలో కాకపోయినా ఒకటి రెండింటిలోనైనా సాధించాలి.

**జననీ జన్మభూమిశ్చ......**

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! అధ్యాపకులారా!

విద్యార్థులను పరిశుద్ధ హృదయులుగా మార్చి, పవిత్రమైన ఆదర్శమైన పౌరులుగా మార్చాలంటే అధ్యాపకులు పవిత్రమైన భావాలు పెంచుకోవాలి. దేశముయొక్క భవిష్యత్తు వారి బాధ్యతగానే ఉంటున్నది. వారే దీన్ని భరించవలసి వస్తుంది. భావిభారతోద్ధారకులు యీ విద్యార్థులు. భారతోద్ధారకులైన విద్యార్థులు ఏవిధంగా దీన్ని మార్చగలరు. మొట్టమొదట నీవు మారి విద్యార్థులను మార్చటానికి ప్రయత్నం చేయాలి. నీవు సిగరెట్లు తాగుతూ పిల్లవానిని తాగకూడదంటే వాడు వింటాడా. సార్ మొట్టమొదట మీరు మానితే మేము మానుతామంటారు. అందులో యిప్పుడు ఆధునిక యుగములో నున్న విద్యార్థులు ఎప్పటికప్పుడే ప్రశ్నిస్తారు. వారితో ఏవిధమైన ప్రశ్నలు రాకుండా మీరు ప్రయత్నం చేయాలి. ఇంతే కాదు నడతలు కూడా చక్కగా ఉండాలి. నడవడికలు సరిగా ఉండినప్పుడే విద్యార్థులు దానిని సరిగా అనుసరిస్తూ వస్తారు. అప్పుడే మీ గురుత్వానికి తగిన లక్ష్యము ఏర్పడుతుంది. మంచి అభ్యాసాలు చేసుకోవాలి. మంచి పలుకులు నేర్చుకోవాలి. కఠినమైన పలుకులు ఏమాత్రం వినియోగించకూడదు. పిల్లలను ప్రేమతో దగ్గరకు తీయాలి. మంచి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందించాలి. అలాంటివి అందించినప్పుడే విద్యార్థులు మంచి

sri sathyasai vachanamrutam

పౌరులుగా తయారౌతారు. ఈనాడు ఏవిధమైన విద్యార్థులు కావాలి. ఆదర్శ పౌరులుగా తయారుకావాలి. మన పల్లెలందే మనము నివసించాలి. అక్కడనే మన సంస్కృతి అంతో యింతో మిగిలి ఉంటున్నాది. కాబట్టి ఆ **culture** ని మనం పోషించాలి. కానీ యీనాటి పల్లెలందున్న విద్యార్థులు పల్లెలను వదలి పట్టణాలకు బయలుదేరుతున్నారు. పట్టణాలకు పోయి ఏమి చేస్తున్నారు. అన్నీ దురభ్యాసములు, దుస్సంగములు, దుర్బుద్ధులతోనే జీవిస్తున్నారు. ఏమాత్రము పాపభీతి, దైవప్రీతి ఏమాత్రం కనిపించటం లేదు. ఈ రెండు లేనప్పుడు సంఘనీతి ఎట్లా లభిస్తుంది. పాపభీతి ఒక్కటి మనస్సులో పెట్టుకుంటే దైవప్రీతి మీకు లభిస్తుంది. దైవప్రీతిని మీ హృదయంలో ప్రతిష్ఠ చేసుకుంటే పాపభీతి మీయందు లభిస్తుంది. కనుక మొట్టమొదటి దైవప్రీతిని పెంచుకోండి. ఆ దైవప్రీతి వల్ల ఎంతటి కార్యమునైనా సులభంగా సాధించవచ్చును. మీకందరికి తెలుసు చర్చిల్ ఉండేవాడు. ఇంగ్లాండుకు ప్రైమినిష్టరుగా ఉండేవాడు. అతను ఏమాత్రము చదవలేదు. మిలట్రీలో పనిచేస్తూ వచ్చాడు. అలాంటి దశలో గొప్ప విజయాన్ని సాధిస్తూ వచ్చాడు. మనవారు మిలట్రీలో పోయి చేరమంటే మమ్మల్ని చంపటానికి ప్రయత్నం చేస్తున్నారా మీరు అంటారు. దేశసంరక్షణ అవసరము. దేశక్షేమాన్ని ఆశించాలి. కనుక పూర్వము కెన్నడీ అను అమెరికా ప్రసిడెంటు కూడా మిలట్రీలో ప్రవేశించి పైలెట్‌గా పనిచేశాడు. అంతేకాదు. ఇంకా అనేకమంది గొప్పగొప్ప వారు మిలట్రీలో ప్రవేశించి దేశరక్షణకు పాటుపడ్డారు. మన సమాజమును మనం అభివృద్ధిపరచుకోటంలో చిన్నది, పెద్దది అని సందేహించనక్కర లేదు. కేవలం క్వాంటిటీకి పోతున్నావు గానీ క్వాలిటీ కావాలి మనకు. ఎందుకు క్వాంటిటీ? ఈనాడు పెద్ద పెద్ద వారంతా రాజ్యాలు ఏలుతున్నారు. ఏలి ఏమి చేస్తున్నారు? దేశాన్ని బీదరికంగా చేస్తున్నారు. అలాంటి బీదరికంగా చేసే పాపం కంటే ఏ ఉద్యోగము లేక సమాజ సేవ చేసుకుంటే గొప్పతనము. "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి." జననిని, జన్మభూమిని మనం కాపాడాలి. రావణుడు మరణించిన తర్వాత విభీషణుడు రాముని పాదము పట్టుకొని స్వామీ! నేను రాజు కావాలని ఆశించలేదు. నా అన్నగారి దుర్గుణములు దూరము చేయాలని ఆశించాను. దీనికంతా రాజు మీరే. కాబట్టి మీరే యీ లంకకు రాజుగా ఉండండి అన్నాడు. రాక్షసులందరు వచ్చారు. అందరు రాముడే రాజు కావాలని

sri sathyasai vahini.org

ప్రార్థించారు. లక్ష్మణుడు కూడా ప్రోద్బలం చేశాడు అన్నా అయోధ్య భరతుడు ఏలుతున్నాడు. నీవు వెళ్లిన తరువాత నీవు రాజు కావటానికి అవకాశముండదు. మీరు ఆడిన మాట తప్పనివారు కాబట్టి యిక్కడే ఉంటుండి రాజ్యమును ఏలి ఈ రాక్షసత్వాన్ని దూరము చేయండి అన్నాడు.

**బంగారు కోటలు**
**సందుసందల దొంతుశాలలు రాజమేడలు**
**రంతు చేసెడి కాంత కేళి గృహంబులు**

అలాంటి అందమైన లంక ఎక్కడున్నాది? ఇలాంటి పవిత్ర బంగారుకోటలతో కూడిన ఈ లంకకు రాజు కావటం నాకు ఎంతో ఆనందమన్నాడు. లక్ష్మణుని దగ్గరకు తీసుకొని 'లక్ష్మణా ఈ పిచ్చి వాసన నీకు ఎందుకు కల్గింది అన్నాడు. మన తల్లి జన్మభూమి. తల్లి కురూపిగా ఉందని ఏదో అందముగా నున్న దానిని తల్లి అని తలచటం న్యాయంగా ఉందా? కురూపి అయినా తల్లి తల్లియే. నాభారతదేశము పేదరికముగా నున్నప్పటికిని అది నా తల్లి. యిది గొప్ప సువర్ణముతో కూడిన దేశమని నేను ఆశించను. నాకే దేశము అక్కరలేదు. నాదేశమే నా తల్లి. ఆవిధమైన విశ్వాసము యీనాడు విద్యార్థులలో బయలుదేరాలి. నాదేశము నాదేశము అనే భావన మనలో ఆవిర్భవించాలి. అదే యీనాడు విద్యార్థులకంతా నేర్పించాలి అధ్యాపకులు.

**ఇది నాదు మాతృదేశము**
**యిది నా ప్రియ మాతృభాష**
**యిది నా మతమంచు ఎదగొట్టి**
**నుడువ నేరని పీనుగు ఒకండు వసుధన్ గలడా!**

ఆవిధంగా ఎదగొట్టి చెప్పే విద్యార్థులుగా మీరు తయారుకావాలి. యిది నా భారతదేశము. విదేశముల సంపద ఆ దేశములకు ఉంటుంది. కానీ యీనాటి విద్యార్థులకు ఆ పవిత్రమైన భావములు ఏమాత్రం కనిపించటం లేదు. ఇంజనీరో, డాక్టరో ప్యాసైన తక్షణమే పాస్‌పోర్టుకు, వీసాకు ప్రయత్నాలు చేస్తుంటారు. ఏమిటి యీ పాస్‌పోర్టు వీసాలు.

srisathyasaivachanamrutam

మొట్టమొదట మనయందే ఉంటున్నాయి పాస్‌పోర్టు వీసా. Export and import మనయందే ఉంటున్నాది. Export ఏమిటి, అది మన హృదయము నుండి ఆవిర్భవించే పవిత్రభావములే. యింక import బయటనుండి మంచినంతా తీసుకోవాలి. దాన్ని import చేయాలి. దీన్ని export చేయాలి. ఏ పాస్‌పోర్టు, ఏ వీసాలు అక్కరలేదు. నీలోనున్న మంచి యితరులకు బోధించటానికి ఏ passport కావాలి. అదియే మన export. సర్వము మనయందే ఉంటున్నాయనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ఎవరికోసం నీవు ప్రాకులాడనక్కరలేదు. దైవంకోసం కూడా మీరు ప్రాకులాడనక్కరలేదు. **"మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతన:"** అనగా అందరు దైవాంశ స్వరూపులే. అంతా దైవము యొక్క గుణాలు మీయందుంటున్నవి. దైవము యొక్క శక్తులంతా మీ యందుంటున్నవి. శక్తులే లేకపోతే మీరు ఎట్లా చదువుగల్గుతున్నారు. ఎంత కష్టమైన subject అయినను మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు. ఆ శక్తి బయటినుండి వచ్చిందా? నీలో నుంచే వచ్చింది. Everything is with in you. ఆ బయట కనిపించేవి బయటవని అనుకుంటున్నావు. కాదు కాదు. నీనుండి వచ్చినవే. Reflection of the innerbeing నీలో ఉన్నదే నీకు కనిపిస్తున్నాయి. బయటినుండి చేరినవి కాదు.

**శాంతిప్రేమ మీయందే యున్నది**

ప్రేమస్వరూపులారా! ప్రేమంతా మీయందే ఉన్నది. peace అంతా మీయందే ఉన్నాది. You are the embodiment of peace. You are the embodiment of truth. You are the embodiment of love. You are the embodiment of Righteousness. You are the embodiment of God. ఆవిధమైన సత్యాన్ని మీరు విశ్వసించండి. ఆ విశ్వాసముతో మీరు జీవితము నడిపినప్పుడు యింకే విధమైన అడ్డంకులు రావు. Life is love, enjoy it. Life is challenge, meet it. Knowledgeని మనం skill చేసినప్పుడే balance సమానంగా ఉంటుంది. ఈనాడు పిల్లలయందు balance పోయింది. సుఖ దుఃఖములు రెండు balance చేసే తత్వమే పోయింది. కారణం ఏమిటి skill అనేదానిలో s తీసి kill చేస్తున్నారు. మనం knowledge ని kill చేయకూడదు. Skill చేయాలి. అప్పుడు balance చక్కగా వస్తుంది. Balance సరిగా ఉన్నప్పుడు insight మీలో ఆవిర్భవిస్తుంది.



sri sathyasai vachanamrutam

అది లేకపోవటంచే out looks పోతున్నాయి. అంతా బయట దృష్టే. ఈ బయట దృష్టి ఎక్కడిది? నీ నుండి వచ్చేదే. కానీ దాని సరైన స్థితిలో మనం పోషించుకోవాలి.

**ఐకమత్యమే జీవిత లక్ష్యం**

విద్యార్థులారా! మీ అంతటివారు, మీ గుణములంతటి వారు తిరిగి సరైన వారిని తోడ్పాటు చేసుకుని వాని సంబంధముతో మీరు కలసి సంఘ దోషములను దూరముచేసి పవిత్రమైన సంఘమును తయారుచేయాలి. ఐకమత్యముకంటె మించిన ఐశ్వర్యము మరొకటి లేదు. ఐకమత్యమే మన జీవితము యొక్క లక్ష్యము. ఆచరణే దాని అభివృద్ధికి మూలకారణము. కనుక మనం ఐకమత్యాన్ని పెంచుకోవాలి. I and you are one. ఈవిధంగా భారతదేశములో 90 కోట్లమంది I and you are one అన్నింటిని ప్లస్ చేసుకుంటూపోతే ఎంత ఆనందమవుతుంది. నీ తమ్ముడు అనుకున్నప్పుడు నీవు ఎంత ప్రేమిస్తున్నావు. అదే ప్రేమ. అందరు నా తమ్ములే అందరు నా అన్నలే ఆవిధంగా ప్రేమించు. నీ తమ్ముడైదైనా తప్పుచేస్తే కొడతావు కదా. అట్లానే బయటవాడు తప్పుచేస్తే వానిని కొట్టు కానీ తమ్ముని ప్రేమతోనే చూడు. అమ్మ ఉంది. తప్పు చేసినప్పుడు బిడ్డను కొడుతుంది. కొట్టిన తరువాత తన ఒడిలో కూర్చో పెట్టుకుని లాలిస్తుంది. కొట్టడం కూడా ప్రేమచేతనే కొడుతుంది. ప్రేమ ఉండటం వల్ల అట్లా కొడుతుంది. శబ్దము బాగా వినిపిస్తుంది. ఈవిధంగా పెట్టుకుంటే గాలి శబ్దము వస్తుంది గట్టిగా కొట్టినట్లు. శబ్దము వినిపించాలి గానీ వేటు తగలకూడదు. అదేవిధంగా నీవు తప్పు చేసిన వానిని శిక్షిసున్నావా? దైవం కూడా అదే పని చేసేది. తప్పు చేసిన వానిని శిక్షిస్తుంటాడు. ఆ శిక్షణ ఒక రక్షణ కోసమనే. డాక్టరు కత్తి తీసుకుంటాడు. పొట్టలోనున్న గడ్డను ఆపరేషను చేసి తీస్తాడు. అతను దుర్మార్గుడా? అతను చేసిన పని మంచా చెడ్డా? అతను కత్తితో కోసినప్పటికిని అతను ఉపకారి అపకారి కాదు. అదేవిధంగా దైవము కొన్ని శిక్షలు యిచ్చినా ప్రేమతో యిచ్చినవే. Love lives by giving and forgiving self lives by getting and forgetting. కనుక self ఉండకూడదు మనయందు. Love తో ఏమైనా చేయి. అంతా మంచే జరుగుతుంది. కాబట్టి love is God live in Love. నీ స్నేహితులతో ప్రేమతో మాట్లాడు వారికి ఏవిధమైన చిక్కు కల్గితే సహాయము చేయి.

srisathyasaivachanamrutam

**నమ్మిచెడినవారులేరు**

నా విషయంలో నేను చెబుతున్నాను. ఈ దేహము విద్యార్థిగా ఉండినప్పుడు ఉరవకొండలో ఉండినాను. ఆ ఉరవకొండలో ఆరవతరగతి చదువు తున్నాను. అప్పుడే బయలుదేరింది. SSLC ముగ్గురు ఒక దస్కుపైననే కూర్చునే వారము. నేను మధ్యన కూర్చుంటే అటువైపు ఒకడు యిటువైపు ఒకడు కూర్చునే వారు. రమేష్, సురేష్. వారు పక్కా మొద్దులు. చదువు ఏమీ రాదు. పరీక్షల సమయములో సహాయము చేయాలని చాలా ఆశ్రయిస్తూ వచ్చారు. సత్యా! మేము సరిగా చదవలేము నీలాగ. నాకు ఏవిధంగానైనా సహాయం చేయాలి. కోరిన వారికి కాదని చెప్పటానికి వీలుకాదు. నేను చేస్తాను అన్నాను. రేపటి దినము పరీక్షలలో వచ్చేదంతా యీనాడే questions కి answers అంతా చెప్పించాను. పరీక్ష వచ్చింది. Public Examination. నాది ఆరవ నెంబరు, ఒకనిది 60వ నెంబరు, యింకొరిది 600వ నెంబరు. 6, 60, 600 ఎక్కడెక్కడ కూర్చుంటారో. నేను వ్రాసేది కాపీ కొట్టటానికి వీలుకాదు. వారు పరీక్షకు రామన్నారు. అప్పుడు వారికి చెప్పాను. తప్పు యింతకాలము చదివి పరీక్ష ప్యాసో ఫెయిలో తేల్చుకోవాలి గానీ తిరిగిపోవటం మంచిది కాదన్నాను. పూర్తి అచంచలమైన విశ్వాసముతో నన్ను నమ్మండి నేను చూచుకుంటాను అన్నాను. చేయకూడనిది అయినను మంచి చేయటంలో తప్పు లేదు. రెండు గంటలు టైము ఇచ్చారు పరీక్షకు. నాదంతా పదహైదు నిముషాలలో వ్రాసాను. కాగితాలు కూడా వారే యిచ్చేవారు. ఆ పేపర్సు తీసుకొని వ్రాసేసాను. తరువాత కొన్ని పేపర్లు అడిగి యిప్పించుకున్నాను. దానిపై రమేష్ hand writing గానే వ్రాసాను. అన్ని ఆన్సర్లు వ్రాసాను. దాని పైన రమేష్ అని వ్రాశాను. సురేష్ వాని hand writing గా మార్చి వ్రాసాను. వాని పేరు వ్రాసి మూడు పేపర్లు నా దగ్గరే పెట్టుకున్నాను. నేను లేచేంతవరకు మీరు లేవకూడదన్నాను. రెండు గంటలై పోయింది. గంట కొట్టారు. Examiner ఉండి చూస్తూ ఉంటారు. పేపరు పేపరు అని అందరి దగ్గరకు వచ్చారు, అందరూ లేచారు. ఈ లోపల మూడు పేపర్లు టేబులుపై పెట్టాను. వీరు లేచి బయటకు వచ్చేశారు. ఎవ్వరు ఏవిధమైన అభ్యంతరము చెప్పలేదు. మరి పది దినాలకు రిజల్టు వచ్చాయి. మా ముగ్గరికీ

sri sathyasai vachanamrutam

1st class. నేను, రమేష్, సురేష్. టీచర్సు ఆశ్చర్యపడ్డారు. ఏమైనా కాపీ కొట్టారా అని. ఒక నెంబరు 6, 60, 600 ఏవిధంగా సంబంధము. ఒకరితో ఒకరు కలవటానికే వీలు లేదు. మరి వెళ్లిన తరువాత క్లాస్ టీచర్సు అడిగారు. నీకు ఎట్లా వచ్చాయి యీ ఆన్సర్లు. అప్పుడు వ్రాసాము యిప్పుడు జ్ఞాపకం లేదన్నారు. వాడు ఏవిధంగా అనుమానపడుటకు అవకాశమే లేదు. దగ్గరుండి చూచి వ్రాసారా అది కాదు. వాని hand writing వాడిదే. నాది నా రైటింగే. ఎట్లా వీరు doubt పడటానికి అవకాశము ఉంటుంది. చెప్పాను. నమ్మినవారిని ఎప్పటికి నేను మోసం చేయను.

**నమ్మక చెడిన వారలున్నారు గానీ**
**నమ్మి చెడినట్టివారు ఈ లోకాన లేరు లేరు లేరు.**

దైవాన్ని నమ్మకుండా చెడినవారు కోట్ల కొద్ది ఉన్నారు. కానీ దైవాన్ని నమ్మి చెడిన వారు ఒక్కరు కూడా లేరు. ఎప్పటికి వారు చెడరు. మధ్య మధ్య ups and downs రావచ్చును. తిరిగి విజయాన్ని సాధిస్తారు. ఆవిధంగా జరిగిన తరువాత నేను తిరిగి పుట్టపర్తి వస్తున్నాను. దేనివల్ల. అక్కడ అనేక మార్పులు జరిగినాయి. నేను స్కూలుకి పోవటం లేదు. టీచర్సు యింటికి వచ్చారు. పిల్లలంతా యింటికి వస్తున్నారు. వారందరికి కావలసినవి తీసి యిస్తున్నాను. ఈవిధంగా ఉండేటప్పటికి ఆ యింటి వారు భరించుకోలేక తల్లిదండ్రులకు టెలిగ్రాము యిచ్చి వారిని పిలిపించుకున్నారు. స్వామిని తీసుకుపోండి అన్నారు. అప్పుడు నేను పుట్టపర్తికి బస్సు ఎక్కాను. ఆ బస్సు ఎక్కేటప్పటికి పిల్లలందరు బస్సులు ఏర్పాటు చేసుకున్నారు. నేను చెప్పాను, పుట్టపర్తి బస్సులు పోవటానికి వీలు లేదు. పెనుకొండ, ధర్మవరం మాత్రమే పోతున్నాయి. రోడ్డు కూడా లేదప్పుడు. 60 ఏండ్లకు ముందు ఎక్కడుందీ రోడ్డు. ఎవరు రాకూడదు అన్నాను. ప్రతిదినము స్కూలులో stage పైన స్కూలు ప్రార్ధన చేసేవాడిని అక్కడ.

అన్ని మతముల ఏకత్వమునకు నేను ప్రార్ధన చేసేవాడిని. అందరు ఆనందంగా ప్రార్ధన చేసేవారు. టీచర్సు కూడా ప్రార్ధన చేసేవారు. యిక్కడకు వచ్చిన తర్వాత యింకెవరు ప్రార్ధన చేసేవారు లేరు. ఒక అబ్దుల్‌గఫూర్ అనే boy ముసల్మాను. అతని గొంతు

బాగుండేది. పాడేవాడు. అతనిని ఎక్కించారు స్టేజికి. ఆ స్టేజికి ఎక్కుతూనే స్వామి జ్ఞాపకం వచ్చాడు. గట్టిగా ఏడ్చాడు. అందరు ఏడ్చారు. యింక ప్రార్థనే వద్దన్నారు. నేను పుట్టపర్తి వస్తూనే రమేష్ సురేష్ ఆవిధంగా చేయకూడదు. రమేష్ రాజూ రాజూ పోతున్నావా అని అరచి ఒక బావిలో పడిపోయాడు. నీవు లేకుండా మేము ఉండలేము అని మరణించాడు. రెండవవానికి పిచ్చిపట్టిపోయింది. బెంగుళూరు హాస్పటలుకు తీసుకువెళ్లి చేర్చారు. తండ్రి వచ్చి ప్రార్థించాడు. స్వామీ నీ క్లాసులో కూర్చునే పిల్లవాడు. వాడు మాకు ఒకే కుమారుడు. ఈవిధమైన పరిస్థితి ఏర్పడింది. ఒక్కసారి వచ్చి దర్శనం ఇవ్వండి అన్నాడు. బెంగుళూరు వెళ్లి పిచ్చాసుపత్రిలో చూచాను. రాజు రాజు అని వచ్చాడు. ఎవరిని చూడటం లేదు. "సురేష్, రాజు వచ్చాను చూడు" అన్నాను. తల ఎత్తాడు చూచాడు. కన్నుమూశాడు. శాశ్వతంగా మూశాడు. మరణించాడు. సురేష్ రమేష్ యిద్దరే jack and jill గా పుట్టాయి. పాత మందిరములో చిన్నవి jack and jill అని పేరు పెట్టారు. ఒకటి కాళ్ల దగ్గర పడుకునేది, ఒకటి తల దగ్గర పడుకునేది. తల దగ్గర కాళ్ల దగ్గర చూచుకుంటూ ఉండేది. రాత్రంతా నిద్రించేవి కాదు. ఎవరు కనిపించినా మొరిగేవి. ఈవిధంగా నా వెంటనే యింటనే జంటనే ఉంటుండి పెరుగుతూ వచ్చాయి. ఒకనాడు మైసూరు రాణి వచ్చింది. కర్నాటకపల్లిలో కారు దిగింది. అక్కడ నుండి నడచుకొని రావాలి. వచ్చింది పాత మందిరమునకు. అప్పుడు డ్రైవరు రాత్రి భోజనం చేసి కర్నాటకపల్లికి పోతున్నాడు. నేను చెప్పాను Jack నువ్వు కూడా డ్రైవరు వెంటపోయి దారి చూపించు. రాత్రిపూట దారి కనిపించదు. Jack ముందు నడవటము, డ్రైవరు వెనక పోవటము. రోడ్డు చూపించి కారు దగ్గరకు తీసుకువెళ్లింది. డ్రైవరు చాలా ఆశ్చర్యపడ్డాడు. ఏమిటి నాకు dog మార్గము చూపిస్తున్నాది అని. నేను చెప్పాను dog కాదు God అన్నాను. ఒకటి inside. ఒకటి outside. వారి విశ్వాసము అంత గాఢమైన విశ్వాసము. మరణించిన తరువాత స్వామి దగ్గరే వచ్చి పుట్టారు. తెల్లవారి లేస్తూనే కారు start చేశాడు డ్రైవరు. యివన్నీ జ్ఞాపకము లేదతనికి. ఒక మైలు దూరం చుట్టుకుని రావాలని పోయాడు. కారు కింద పండుకుంటున్నాది jack. దాని నడుముపైనుంచి పోయింది టైరు. Back bone విరిగిపోయింది. అక్కడ నుండి కాలు యీడ్చుకుంటూ వస్తున్నాది ఏటిలో. నా దగ్గర చాకలి సుబ్బన్న అనేవాడు రాత్రి పూట ఉండేవాడు. అతను

పెద్ద మనిషే పాపం. చాలా గౌరవంగా ఉండేవాడు. స్వామి స్వామి కుక్క అరచుకుంటూ వస్తున్నాది అన్నాడు. నేను బయటకు వచ్చాను. దగ్గరకు వచ్చి గట్టిగా ఏడ్చింది. వచ్చి పాదములపై పడింది. ప్రాణము వదిలింది. తరువాత మూడు దినములకే jill కూడా ప్రాణం విడిచింది. ఆ రెండింటి సమాధి పాత మందిరము వెనుకనున్న బృందావనము. Jack and Jill brothers. వారే Ramesh and Mahesh. వారే స్వామి డెస్కుపై యిటువైపు అటువైపు కూర్చున్నవారు. వారిది అమిత ఉత్తమమైన భావము. ఒకనాడు డ్రిల్ మాస్టరు వచ్చాడు. ఆయనవచ్చి స్కౌటు తయారుకావాలన్నాడు. స్కౌటు ఎట్లా కొనాలి? వేషాలు వేసుకోవాలా కాదే. అప్పటి పరిస్థితి ఏమంటే ఉన్నది చెబుతున్నాను. నా దగ్గర దమ్మిడీ లేదు. అప్పటి పరిస్థితి ఆరకంగా ఉండేది. నాకు యింటిలో అడగటానికి ధైర్యం లేదు. అప్పుడు వారి దగ్గర కూడా ఎక్కువ ధనము లేదు. 10 రూపాయలున్నాయంటే గొప్ప ఆనాడు. నూరు రూపాయలు ఉన్నాయనుకుంటే కోటీశ్వరుడనే. అతను చెప్పాడు కాకీ నిక్కరు, కాకీ షర్టు, బెల్టు, విజిల్, బూట్సు యివన్నీ తెచ్చుకోవాలన్నారు. ఇవన్నీ నేను ఎక్కడ తెచ్చుకొనేది. అప్పుడు కమలాపురంలో ఉన్నాను. నా దగ్గర లేవు. రమేష్ తండ్రికి చెప్పాడు. నాన్నా నాకు కాకీ షర్టు అంటే చాలా యిష్టము, నా level లోనే ఉండేవాడు. నేను short కదా. రెండు డ్రస్సులు కుట్టించుకున్నాడు. ఒక నిక్కరు, షర్టు, బెల్టు యివన్నీ pack చేసి వ్రాసాడు 'రాజూ! దీనిని నీవు అంగీకరించకపోతే నేను ప్రాణం తీసుకుంటాను. మీరు మా ప్రాణ సమానులు. కనుక మీరు తప్పక అంగీకరించ వలసిందే. మన స్నేహం యీవిధంగా పోషించుకోవాలి. అప్పుడు ఆపై పేపరు తీసి యింకోటి వ్రాసియిచ్చాను. స్నేహం పెరగాలంటే యిచ్చి పుచ్చుకోటం ఉండ కూడదు. యిచ్చుకునేది ప్రేమ, పుచ్చుకునేది ప్రేమగా ఉండాలి. పదార్థములుగా ఉండకూడదు. కాబట్టి పదార్థము తీసుకుంటే ప్రేమ దూరమైపోతుంది. కాబట్టి నేను దీనికి అంగీకరించను అన్నాను. వ్రాసి అక్కడ పెట్టాను. చాలా బాధ పడ్డాడు. యీ విధంగా అయిపోయిందే అని. నేను చక్కని కవిత్వము వ్రాసేవాడను అప్పుడు. నా సంభాషణలో tradition కష్టమవుతుందని భాషను తగ్గించు కుంటున్నాను గానీ చక్కని భాషను ఉపయోగపెట్టేవాడను. అక్కడ కొట్టే సుబ్బన్న అనేవాడు ఉండేవాడు. Business-man. కొత్తమందు వచ్చింది. దాని పేరు బాలభాస్కర అని. దాని గుణాలంతా నాకు చెప్పించి

sri sathyasai vacharamrutam

రాజు దానిపై పాట వ్రాయించి పదిమంది పిల్లలకు పేపర్లు యిచ్చి రోడ్లంతా తిప్పిస్తాను. మంచిగా advertise అయిపోతుంది అన్నాడు. దానికి ఒక పాట వ్రాసాను.

**దొరికె దొరికె బాలభాస్కర**
**బాలకులారా! రండి బాలకులారా!**
**కడుపుబ్బరము కాళ్లవాపులు**
**చేతిమోదులను చెడుగులనుండి**
**అజాగరూక పోషణ నుండి**
**అజీర్ణ విరేచనములనుండి**
**అన్నింటికి యిది బాగౌనండి**
**బాలకులారా! రండి బాలకులరా!**

మరియింతగా కోరినాడు కనుక అది కూడా వ్రాసాను.

**అది ఎక్కడ అని అడిగేరన్నా?**
**అదిగదిగో కొట్టే సుబ్బన్న**
**అంగడియందే దొరకును అన్నా**
**పండిత శ్రీగోపాలచార్యుల పావనమైన టానిక్కన్నా**

ఈ పాట వ్రాసి యిచ్చేటప్పటికి ఒళ్లు మరిచి, ఆనందంగా యింటికి పరుగెత్తి వచ్చాడు. యింటిలో బొబ్బట్లు చేయించుకొని నా కోసం తీసుకు వచ్చాడు. ఈ యొక్క ప్రచారం చేత బాలభాస్కర చాలా కొన్ని లక్షలకు ఖర్చైపోయింది. అదంతా తెలుసుకొని రెండు చొక్కాలు, రెండు నిక్కర్లు కుట్టించుకుని వచ్చాడు. కొట్టేసుబ్బన్నా! వడ్డికాసులవాడు తిరుపతిలో ఉన్నాడు గానీ నేను వడ్డికాసుల వాడను కాదన్నాను. నేను వ్రాసినందుకు వడ్డీగా యిస్తున్నావా యివి. పుచ్చుకోను అన్నాను. ఆవిధంగా వెనుకకు తిప్పేశాను. చాలా ఏడ్చినాడు, చాలా బాధపడ్డాడు. నేను యింటికి తీసుకువెళ్లనన్నాడు. బయటనున్న బెగ్గర్సుకి యివ్వండి సంతోషమే. ఈవిధంగా ఆనాటినుండి యిచ్చుకునేదే గానీ పుచ్చుకునేది లేదు. నా చేయి ఎప్పుడూ యిట్లా పోయేది కాదు. కానీ ఒక్క దానికి మాత్రం నా చేయి అట్లా పోతుంది.

sri sathyasai vachanamrutam

Pure love. Love also not your property. That is also God's property. కాబట్టి నాదే నేను కోరుతున్నాను. అది కాదు. మీరు దానిని దుర్వినియోగం చేసుకుంటున్నారు. దానివల్లే అనేక దుఃఖములకు గురౌతున్నారు. దైవం కోసం అర్పితం చేస్తే చక్కని సుఖాన్ని పొందుతారు. కనుక ఆనాడు విద్యార్థిగా ఉన్నప్పుడు చక్కని ఉపకారములంతా చేస్తూ చక్కని ఆనందాన్ని అందిస్తూ అందరిని నవ్విస్తూ ఉండేవాడిని. మీరు కూడా సాయి institute లో ఉంటున్నారు కనుక మీరు కూడా యిట్టి help చేసుకుంటూ వారిని ఆనందములో ముంచే దీనికి సిద్ధంగా ఉండండి. ఎవరిని దుఃఖింపచేయకండి. ఇదే help ever hurt never. ఈ గుణాన్ని పిల్లలు నేర్చుకోవాలి. యింకా కొన్ని విషయాలున్నాయి పిల్లల లోపల. కొన్ని హైస్కూలులో, ప్రైమరిస్కూలులో, హయ్యర్ సెకండరీ స్కూలులోని పిల్లలకు homework యిస్తారు టీచర్స్. Homework యింటికి తీసుకువెడతారు. అన్నతోనో, అక్కతోనే చేయిస్తే చాలా దోషము. అది గురువును మోసం చేసినట్లవుతుంది. అట్లాంటివి చేయకూడదు. ఈవిధమైన గుణాలు పిల్లలు పెంచుకుంటూ రావాలి. ఆవిధమైన good qualities God qualities అయిపోతాయి. పూర్వము బ్రిటీషువారు యిక్కడుండినప్పుడు మొట్టమొదట పిల్లలను చూచినప్పుడు God boy God boy అనేవారు. క్రమక్రమేణా యింగ్లీషు నేర్చుకోటంవల్ల మెకాలే యింగ్లీషు mix చేయటం వల్ల good boy good boy అని మార్చారు. ఆయనే యింగ్లీషు start చేసింది. God boy అనేది తీసి good boy అని చేర్చాడు. మరికొంతకాలమైన తరువాత boy boy. మరొకొంతకాలమైన తరువాత good bye good bye అన్నారు. ఆ good కూడా పోయి bye అంటున్నారు. కాబట్టి God boy అనే పదమునుండి bye కి దిగిపోయింది చదువంతా. మీరు God boys గానే ఉండాలి. ఎప్పుడూ God boys గానే ఉండాలి. Bye bye అనే దానికి మనం ఏమాత్రము పూనుకోకూడదు. ఈవిధముగా విద్యలందు గానీ, పదవులయందుగానీ, ప్రవర్తన యందుగానీ మన ప్రవర్తన ఆదర్శవంతమైనదిగా నిరూపించాలి. చాలా టైము తీసుకొని మిమ్మల్ని శ్రమపెట్టాను. మీరు ముద్దనహళ్ళి, వెళ్లి మీ నిత్యజీవితములో చేయవలసిన కృత్యములలో పాల్గొని విజయాన్ని సాధించండి. నేను వస్తూ పోతున్నప్పుడు ముద్దనహళ్లి పోయేవాడిని. కాని అళికెకు 12 సంవత్సరాలయ్యింది పోయి. ఈసారి తప్పక అళికెకు

sri sathyasai vachanamrutam

వస్తున్నాను. నేనే కాదు. మన కాలేజి పిల్లలను కొంతమందిని తీసుకువస్తాను. పుట్టపర్తిలో బయలుదేరి నేరుగా మంగుళూరులో దిగుతాను. ఈ సారి మీ అందరికి అక్కడ కూడా ఆనందాన్ని అందిస్తాను. Be always happy.

**(తేదీ 11-09-1998న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam